సాక్షి
వికారాబాద్
గురువారం । 25 । జనవరి । 2024



'సీసీ' గోస..!

కుల్కచర్ల మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. 8లో▸



వివక్ష లేని సమాజాన్ని..

వివక్ష లేని సమాజం కోసం కృషి చేద్దామని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి అన్నారు. 8లో▸



ఇక వారం రోజులే

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్న ఆశావహులపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. 9లో▸

న్యూస్‌రీల్

గ్రామాల అభివృద్ధికి సహకరిస్తాం

ఎంపీ రంజిత్ రెడ్డి



నారెగూడలో పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

నవాబుపేట: పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. బుధవారం మండలంలోని దాతాపూర్, ముబారక్‌పూర్, గొల్లగూడ, నారెగూడ గ్రామాల్లో నిర్మించిన పంచాయతీ నూతన భవనాలను స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలసి ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. జీపీలకు కొత్త భవనాలు నిర్మించిన ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తే ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కామిరెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, సర్పంచులు బలవంత్ రెడ్డి, బాలమణి, శ్రీనివాస్ గౌడ్, పర్మయ్య, నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్, ఆనంద్ రెడ్డి, బుచ్చయ్య, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుని సన్నిధిలో ఎమ్మెల్యే



ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

తాండూరు టౌన్: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ తిరుపతి వేంకటేశ్వర స్వామిని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నానని, నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్



నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు

పరిగి: గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఏఎన్ఎంలకు జీతాలు చెల్లించకపోవడం సరికాదని, వారికి వెంటనే న్యాయం చేయాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పరిగి పట్టణంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 15మంది ఏఎన్ఎంలను నియమించిందని తెలిపారు. నాలుగు నెలలుగా వారికి వేతనాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియామక సమయంలో అధికారులు ఆర్డర్ కాపీ ఇస్తామని చెప్పి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకున్నారని, వేతనాల కోసం ఉన్నత అధికారులను సంప్రదిస్తే ఎలాంటి సమాచారం అందించడం లేదని తెలిపారు. ఏఎన్ఎంలకు వెంటనే న్యాయం చేయాలని లేకుంటే గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి: ఎమ్మెల్యే శంకర్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి, ఎలుకగూడెం తదితర గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఎలుకగూడెం, వనంపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా ముత్తూట్ ఫైనాన్స్ సహకారంతో చౌదరిగూడ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మూత్రశాలలు, కిచెన్‌షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలకతీతంగా అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమాజ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాదమ్మ, జెడ్పీటీసీ స్వరూప, అధికారులు పాల్గొన్నారు.

'జన్‌మన్'.. ఆశలు



జిల్లాలో చెంచుల స్థితిగతులపై సర్వే నిర్వహిస్తున్న అధికారులు

- చెంచుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ
- గూడేలు, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం
- మూడేళ్ల పాటు కొనసాగనున్న పథకం
- వారి స్థితిగతులు తెలుసుకునేందుకు ప్రారంభమైన సర్వే
- ఎనిమిది బృందాలు ఏర్పాటు

వికారాబాద్: చెంచుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను ప్రారంభించింది. ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసి న్యాయ అభియాన్ (పీఎం జన్‌మన్) పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. చెంచు గూడేలు, వారి జీవితాల్లో సమూల మార్పుల తోపాటు మౌలిక వసతులు కల్పించాలన్నదే ఈ పథకం లక్ష్యం. ప్రస్తుతం వారి స్థితిగతులు తెలుసుకునేందుకు బుధవారం నుంచి సర్వే చేస్తున్నారు. జిల్లాలో 22 ఆవాసాల్లో చెంచులు నివసిస్తున్నారు. 740 కుటుంబాలు, 2,554మంది జనాభా ఉన్నట్లు గిరిజన సంక్షేమ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. 42 అంశాలతో సర్వే చేపట్టి ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందు కోసం ఎనిమిది బ్లాకులుగా విభజించారు. ఒక్కో బ్లాక్‌లో ఐదుగురు అధికారులు ఉంటారు. సర్వేపై కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేయగా, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కోటాజీ ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

పథకంలో పొందుపరిచిన అంశాలు

పీఎం జన్మాన్ పథకంలో చెంచుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనేక అంశాలను పొందుపరిచారు. ముందుగా వారి వాస్తవ పరిస్థితి తెలుసుకునేందుకు 42 అంశాలతో సర్వే చేయనున్నారు. ఇప్పటి వరకు వారు ఏయే సదుపాయాలు కలిగి ఉన్నారు..? ఇంకా ఏమి అవసరం అనేది తెలుసుకుని ప్రభుత్వం ఇచ్చిన వెబ్ ఆప్షన్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. చెంచులకు పక్కా ఇళ్లు ఉన్నాయా? నీటి సదుపాయం ఉందా.. లేదా..? లాంటివి తెలుసుకుంటారు. ప్రతి చెంచు ఆవాసానికి రహదారి, ప్రతి ఇంటికి విద్యుత్ సౌకర్యం, అందరికి నాణ్యమైన విద్య లాంటివి ఈ పథకం ద్వారా అందిస్తారు. వృత్తి నైపుణ్యం, అందరికీ ఉపాధి, పోషణ, మెరుగైన సమాచార (టెలిఫోన్) వ్యవస్థను అందుబాటులోకి తెస్తారు. ఉచితంగా నిత్యావసరాలు, ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు, గర్భిణులకు ఆర్థిక సాయం, సుకన్య సమృద్ధి యోజన, వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తదితర పథకాలన్నీ అందుతున్నాయా? లేదా..? అనే విషయం తెలుసుకుని అమలు చేస్తారు. ఈ పథకాన్ని తెలంగాణ తోపాటు 28 రాష్ట్రాల్లో అమలు చేయాలని నిర్ణయించారు. ఇందు కోసం రూ. 24వేల కోట్లు వెచ్చించనున్నారు. రాబోయే మూడేళ్లలో ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

పక్కాగా అమలు చేస్తేనే..

చెంచుల అభ్యున్నతికి గతంలో ప్రవేశ పెట్టిన పలు పథకాలను బేరీజు వేసుకొని, గత వైఫల్యాలు పునరావృతం కాకుండా చూసుకుంటే పీఎం జన్మాన్‌లో మంచి ఫలితాలు, నిర్దేశించిన లక్ష్యం చేరుకోవచ్చని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. గతంలోనూ ప్రభుత్వాలు వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనేక పథకాలు అమలు చేసిన విషయం తెలిసిందే. అయితే అవేవి వారి జీవితాల్లో ఆశించిన మార్పులను తీసుకురాలేకపోయాయి అన్నది బహిరంగ రహస్యం. నేటికీ చెంచు గూడేలు, కాలనీల్లో కనీస వసతులు, వైద్యం, విద్య అందుబాటులో లేవు.

సర్వే ప్రారంభం



కలెక్టర్ ఆదేశాల మేరకు పీఎం జన్మాన్ పథకం అమలు కోసం చెంచు కాలనీలు, ఆవాసాల్లో వసతులపై సర్వే చేపట్టాం. ముందుగా వారి స్థితిగతులు తెలుసుకుంటున్నాం. ఈ నెల 30వ తేదీ వరకు సర్వే నిర్వహించి వారి అవసరాలను గుర్తిస్తాం. ఇందు కోసం అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. తాము సేకరించిన వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తాం.

– కోటాజీ, డీటీడబ్ల్యూఓ, వికారాబాద్



విద్యార్థినులతో కలిసి కేక్ కట్‌చేస్తున్న సునీతారెడ్డి

బాలికలను భారంగా చూడొద్దు

- బాధ్యతగా చదివించండి
- జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి

బషీరాబాద్: బాలికలను భారంగా చూడొద్దని, ఆడ పిల్ల పుడితే ఆ ఇంట్లో మహాలక్ష్మి పుట్టిందని తల్లిదండ్రులు సంబరపడాలని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బషీరాబాద్ బాలికల పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కొందరు ఆడపిల్లలు పుడితే భారంగా భావిస్తారని, మగ పిల్లల కోసం ఆరాట పడుతుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కడుపులో ఉండగానే ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణ హత్యలు జరిగేవని, ఇప్పుడు కొంతమేర తగ్గాయన్నారు. తల్లిదండ్రులు లింగభేదం లేకుండా ఉన్నత చదువులు చదివించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం ద్వారా కొంత మంచి జరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఆడపిల్ల పుడితే కేసీఆర్ కిట్ ద్వారా రూ.13వేలు ఆర్థిక సాయం చేసిందని, వారి ఉన్నత చదువులకు కూడా ఆర్థిక సాయం, వారి పెళ్లికి కల్యాణలక్ష్మి పథకం కింద రూ. లక్ష రూపాయల సాయం చేసిందని గుర్తు చేశారు.

'పది'లో సత్తా చాటాలి

రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటాలని సునీతారెడ్డి సూచించారు. మంచి గ్రేడ్‌తో ఫలితాలు సాధిస్తామని విద్యార్థినులతో ప్రమాణం తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణ, హెచ్ఎం హీర్యానాయక్, సొసైటీ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా ఉపాధ్యాయులు, విద్యార్థులకు నిర్వహిస్తున్న 'లీడ్ ఎర్త్ లీడర్' శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ నేటితరంపై ఉన్న సామాజిక బాధ్యత అని.. విద్యార్థులు దీనిని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. మనచుట్టూ ఉన్న గాలి, నీరు, భూమి కాలుష్యం కాకుండా చూడాలని కోరారు. తదనంతరం పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అతిథులు ప్రసంగించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లను అందజేశారు.



పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కోటిరెడ్డి

పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలు

- అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని ఎస్పీ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై ఎస్పీ కోటిరెడ్డితో కలిసి మాట్లాడారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్య అతిథి సందేశం, పోలీసు గౌరవ వందనం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల స్టాల్స్, వీఐపీ, మీడియా ప్రతినిధులకు సంబంధించిన గ్యాలరీల ఏర్పాటు, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాల అందజేత తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఆర్‌డీవో కృష్ణన్, వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి అమరేందర్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ హమ్మద్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు లాభదాయకం

- కలెక్టర్ నారాయణరెడ్డి
- వికారాబాద్ నేలలు అన్ని పంటలకు అనుకూలం
- మామిడి సాగుపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఉద్యాన వన పంటల సాగు లాభదాయకమని, రైతులను ఈ దిశగా ప్రోత్సహించాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మామిడి సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన పంటల సాగులో శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. వికారాబాద్ ప్రాంతం అన్ని పంటల సాగుకు అనుకూలమని తెలిపారు. ఉద్యాన వన పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు భూ సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో జిల్లా అభివృద్ధికి కృషి విజ్ఞాన కేంద్రం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 13వేల ఎకరాల్లో మామిడి పంట సాగవుతున్నట్లు తెలిపారు. ఉద్యాన పంటల సాగుకు అధికారుల పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. అనంతగిరి రైతు ఉత్పత్తి సంస్థను ఏర్పాటు చేసి మామిడి పండ్లను దేశ విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కొండాలక్ష్మణ్ యూనివర్సిటీ వీసీ నీరజ ప్రభాకర్ మాట్లాడారు. ఉద్యాన వన పంటల తోపాటు కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. వికారాబాద్ జిల్లా హైదరాబాదుకు అతి సమీపంలో ఉన్నందున కూరగాయలు, పూలు, పండ్ల తోటలు సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని తెలిపారు. అంతర్ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. యువ రైతులు సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ఉత్తర భారతదేశానికి ఇతర దేశాలకు ఎగుమతి చేసే విధంగా పంటల సాగును పెంచే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతు బిడ్డలుగా ఉండి వారసత్వంగా వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఆమె సూచించారు. తక్కువ వనరులతో ఎక్కువ లాభం పొందే ఉద్యానవన పంటలను సాగు చేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖ సంచాలకులు భగవాన్, అపెడ ఏజీఎం ఆర్‌పీ నాయుడు, ఉపసంచాలకులు మధుసూదన్, ఎఫ్‌పీఓ డైరెక్టర్ సుబ్బారెడ్డి, జిల్లా అధికారి చక్రపాణి, ఏఆర్ ఫామ్ ఎండీ మహమ్మద్ రఫీ, ఉద్యాన వన శాఖ అధికారులు కమల, వైజయంతి, అర్చన, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం క్యాంపు కార్యాలయంలో నావికాదళం అధికారులతో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

నేవీ రాడార్ స్టేషన్‌కు లైన్ క్లియర్

- 1,174 హెక్టార్ల భూమి కేటాయింపు
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- ఈ ప్రాంత అభివృద్ధిపై సీఎం రేవంత్ ప్రత్యేక దృష్టిసారించారని వెల్లడి

పరిగి: ఎన్నో సంవత్సరాలు పెండింగ్‌లో ఉన్న నేవీ రాడర్ సెంటర్ ఏర్పాటు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి దామగుండం అటవీ ప్రాంతంలో 1,174 హెక్టార్ల భూమిని కేటాయించి, స్థల పత్రాలను సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం భారత నావికాదళం అధికారులకు అందజేశారని తెలిపారు. ఇక్కడ నేవీ రెండో వీఎల్ఎఫ్ కమ్యూనికేషన్ స్టేషన్‌ను నెలకొల్పనున్నారని స్పష్టం చేశారు. దీని ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నేవీ రాడార్ సెంటర్ పనులను పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నేవీ కమోండర్ కార్తీక్ శంకర్, సర్కిల్ డీఈఓ రోహిత్ భూపతి, కెప్టెన్ సందీప్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు కట్టాల్సిందే

- రుణాల వసూలుకు హెచ్‌డీసీసీబీ స్పెషల్ డ్రైవ్
- ఉమ్మడి జిల్లాలో రంగంలోకి మూడు ప్రత్యేక టీంలు

యాచారం: హైదరాబాద్ (రంగారెడ్డి) జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు పొందిన రైతుల నుంచి బకాయిలు వసూలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్‌కు ప్రత్యేక టీంలు రంగంలోకి దిగుతున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో(వికారాబాద్, మేడ్చల్ జిల్లాలు)ని లక్ష 20వేల మంది రైతులకు హెచ్‌డీసీసీబీ బ్యాంకు వివిధ పద్దుల కింద కొన్నేళ్ల నుంచి మొత్తం రూ.1,800 కోట్ల రుణాలు ఇచ్చింది. ఆయా మండలాల్లో ఉన్న పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం)ల నివేదిక ప్రకారం దీర్ఘకాలిక, స్వల్పకాలిక, బంగారు నగల తాకట్టు, చిరు వ్యాపారులకు ఇలా పలు పద్దుల కింద రుణాలు ఇచ్చింది. దీర్ఘకాలికం కింద పౌల్ట్రీ, డెయిరీఫాంలు, గొర్రెలు, మేకల పెంపకం కోసం రుణాలు ఇవ్వగా.. స్వల్ప కాలికం కింద వ్యవసాయ పంటలకు పెట్టుబడుల కింద, జీవనోపాధుల కల్పన కోసం చిరువ్యాపారులకు, బంగారు తాకట్టు కింద రుణాలిచ్చారు. అయితే కోవిడ్ నేపథ్యంలో రెండు, మూడేళ్లుగా హెచ్‌డీసీసీబీ టార్గెట్ పూర్తికావడం లేదు. ఇచ్చిన రుణాలకు వడ్డీలు, చక్రవడ్డీలు కలిపి రూ.కోట్లల్లోకి చేరడంతో అధికారులు వసూల్లకు ఉపక్రమించారు. తాజాగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మొండిబకాయిలపై కఠినంగా వ్యవహరించాలని, వసూలు చేయని అధికారులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అధికారులు బకాయిల వసూల్లపై దృష్టి సారించారు.

మూడు ప్రత్యేక టీంలు..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రైతులకు ఇచ్చిన రూ.1,800 కోట్ల రుణాల్లో మార్చి 30లోపు రూ.488 కోట్లు వసూలు చేయాలని హెచ్‌డీసీసీబీ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మూడు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లాలో హెచ్‌డీసీసీబీ డీజీఎం ఉదయశ్రీ ఆధ్వర్యంలో, వికారాబాద్ జిల్లాలో హెచ్‌డీసీసీబీ డీజీఎం సత్యప్రసాద్ ఆధ్వర్యంలో, మేడ్చల్‌లో ఉదయశ్రీ, సత్యప్రసాద్ (హెచ్‌డీసీసీబీ డీజీఎం) ఆధ్వర్యంలో బృందాలు బకాయిల వసూల్లకు దిగనున్నాయి. మార్చి 30లోపు వసూలు చేయాల్సిన రూ.488 కోట్ల టార్గెట్‌కు గాను ఈనెల 20వరకు దాదాపు రూ.150 కోట్ల వరకు వసూలు చేశారు. ఇంకా రూ.338 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అధికారులు నేరుగా రైతులు మార్టిగేషన్ చేసిన వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి దీర్ఘకాలిక రుణాలు తీసుకుని దేనికి ఖర్చు చేశారు.. పౌల్ట్రీ, డెయిరీ ఫాంలు, మేకలు, గొర్రెల పెంపకంతో ఆర్థిక ప్రగతి సాధ్యమవుతోందా.. తీసుకున్న రుణాలను దుర్వినియోగం చేశారా అనే వివరాలు సేకరిస్తున్నారు. రైతుల పేర్ల మీద పీఏసీఎస్‌లు, హెచ్‌డీసీసీబీ సిబ్బంది ఏమైనా బినామీ రుణాలు పొందారా అనే వివరాలపైనా ఆరా తీస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రికవరీ స్పెషల్ డ్రైవ్ టీంలు

రంగారెడ్డి	ఉదయశ్రీ (హెచ్‌డీసీసీబీ డీజీఎం)
వికారాబాద్	సత్యప్రసాద్ (హెచ్‌డీసీసీబీ డీజీఎం)
మేడ్చల్	ఉదయశ్రీ, సత్యప్రసాద్ (హెచ్‌డీసీసీబీ డీజీఎంలు)

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో హెచ్‌డీసీసీబీ ఇచ్చిన రుణాల వివరాలు

మొత్తం రైతుల సంఖ్య	2,50,432
మొత్తం పీఏసీఎస్‌లు	51
హెచ్‌డీసీసీబీ బ్రాంచ్‌లు	30
రైతులకు ఇచ్చిన అన్నిరకాల రుణాలు	రూ.1,800 కోట్లు
2024 మార్చి 30లోపు వసూల్ చేయాల్సిన బకాయి టార్గెట్	రూ.488 కోట్లు
దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలతో పాటు పలురకాల రుణాలు పొందిన రైతుల సంఖ్య	లక్ష 20వేలు

నవంబర్‌లోనే నోటీసులు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ పద్దుల కింద రుణాలు పొంది బకాయిలు చెల్లించని రైతులకు ఇప్పటికే పీఏసీఎస్‌ల ద్వారా డిమాండ్ నోటీసులు పంపించారు. దాదాపు 85వేల మంది రైతులకు గతేడాది నవంబర్‌లోనే స్థానిక పీఏసీఎస్‌ల సిబ్బంది ద్వారా నోటీసులు జారీ చేయించారు. మార్చి 30లోపు వడ్డీతో సహా బకాయి మొత్తం చెల్లించాలని.. లేని పక్షంలో ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని నోటీసుల్లో పేర్కొన్నారు.

క్లుప్తంగా

దోపిడీ రహిత సమాజానికి కృషి

సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అనంతగిరి: దోపిడి రహిత సమాజం నిర్మించడానికి వర్గ పోరాటాలను బలోపేతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ మతపరమైన రాజకీయాలు చేస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. బడా పెట్టుబడిదారులకే పబ్బం కడుతున్నారని, దేశ సంపద ప్రజలందరికీ అందాలన్నారు. లెనిన్ పోరాటాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుదర్శన్, శ్రీనునాయక్, రమేష్, శ్రీనివాస్, అనసూయ, రేణుక, సునీతా, అనిత, దేవిబాయి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

తాండూరు టౌన్ : ఐదేళ్ల బాలికపై ఓ బాలుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై బుధవారం తాండూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ ఆలయంలో పూజారి కుమారుడు(9) ఆలయ సమీపంలో ఉండే ఐదేళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

భర్త, అత్త వేధింపులు భరించలేక భవనం నుంచి దూకిన మహిళ


తార మృతదేహం

మొయినాబాద్: అదనపు కట్నం కోసం కుటుంబసభ్యులు వేధించడంతో ఓ వివాహిత నాలుగో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌షేషన్ పరిధిలోని చిలుకూరులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు రాజీవ్ గృహకల్పలో నివాసముండే కాడిగళ్ల రాజు కూమార్తె తార(21)ను అక్కడే నివాసముంటున్న గున్నడి రాహుల్‌కి ఇచ్చి మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేశారు. కొంత కాలంగా భర్త, అత్త అదనపు కట్నం తీసుకురావాలని తారను వేధిస్తున్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె బుధవారం రాజీవ్ గృహకల్ప భవనం నాలుగో అంతస్తు నుంచి కిందికి దూకింది. వెంటనే గమనించిన స్థానికులు ఆమెను ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం తార మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అంబులెన్స్ తనిఖీ

రికార్డులు పరిశీలించిన 108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వసంత్‌పాపయ్య


రికార్డులు పరిశీలిస్తున్న వసంత్‌పాపయ్య

మహేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 108 అంబులెన్స్ వాహనాన్ని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వసంత్ పాపయ్య మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న రికార్డులను పరిశీలించి పైలట్, టెక్నిషియన్‌లతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి తగు సలహాలు, సూచనలు అందించారు. 108 వాహనానికి ఫోన్ చేసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు సరైన ప్రథమచికిత్స అందించాలని మేనేజర్ సూచించారు. కార్యక్రమంలో టెక్నిషియన్ మహేశ్, పైలెట్ కృష్ణ పాల్గొన్నారు.

‘సీసీ’ గోస!


కుల్కచర్లలో అసంపూర్తిగా సీసీ రోడ్డు

రెండేళ్లుగా పూర్తికాని రోడ్డు నిర్మాణం
- ఎగిసిపడుతున్న దుమ్ముతో తరచూ ప్రమాదాలు
- పనులు చేసేందుకు ఆసక్తి చూపని కాంట్రాక్టర్
- అవస్థల్లో ప్రజలు

కుల్కచర్ల: మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం ఈరోజు వరకూ పూర్తి కాలేదు. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కొత్త ప్రభుత్వంలోనైనా తమ బాధలు తీరుతాయని భావించినా ఫలితం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కుల్కచర్లలో 1.2 కిలోమీటర్ల మేర సీసీ రహదారి నిర్మాణం కోసం 2.86 కోట్లు మంజూరయ్యాయి. 2022 ఫిబ్రవరిలో ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించారు. ఇప్పటికి రెండేళ్లు గడుస్తున్నా ఒక వైపు మాత్రమే సీసీ నిర్మించారు. మరో వైపు అసలు పనులే ప్రారంభించలేదు. రోడ్డు నిర్మాణం కోసం చేపట్టిన విస్తరణ పనుల్లో.. పలు ఇళ్లను సైతం కూల్చేశారు. అనంతరం రోడ్డు నిర్మాణానికి కాంట్రాక్టరు ఆసక్తి చూపలేదు.

30 గ్రామాలకు ప్రధాన రోడ్డు

మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు చిన్నదే అయినప్పటికీ సుమారు 30 గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. రెండేళ్లుగా పనులు అసంపూర్తిగా ఉండటంతో ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించే వారు అనేక అవస్థలు పడుతున్నారు. కంకర తేలిన రోడ్డుపై ఎగిసి పడుతున్న దుమ్ముతో ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా పనులు వేగిరం చేయించాలని కోరుతున్నారు.

చర్యలకు వినతి

రోడ్డు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక దుకాణాదారులు అధికారులతో పాటు సర్పంచ్‌కు పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు.


ఒకవైపు పూర్తయిన రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు

పూర్తిచేయాలని సూచించాం



రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రయాణికులు, స్థానికులు అవస్థలు పడుతున్నారని కాంట్రాక్టర్‌కు తెలియజేశాం. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించాం. ఆదిశగా చర్యలు తీసుకుంటాం.

– మహేశ్, ఆర్అండ్‌బీ ఏఈ, కుల్కచర్ల

ఆక్రమణల తొలగింపు


బఫర్ జోన్‌లో నిర్మించిన ప్రహరీని కూల్చివేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నందిగామ: వాగుకు ఆనుకొని బఫర్ జోన్‌లో నిర్మించిన ప్రహరీని అధికారులు తొలగించారు. బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ‘వాగునూ వదల్లేదు’ కథనానికి అధికారులు స్పందించారు. సర్వేయర్ భీమ్లానాయక్, ఆర్ఐ రోజా, ఇరిగేషన్ ఏఈ కార్తీక్.. చంద్రాయన్‌గూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల మధ్యలో ఉన్న వాగును సందర్శించారు. సర్వే నంబరు 1452లోని భూమిని సర్వేచేసి బఫర్ జోన్‌లో కొంతమేరకు ఆక్రమించి ప్రహరీని నిర్మించారని గుర్తించారు. జేసీబీ సహాయంతో ప్రహరీని కూల్చివేశారు. దీంతో వాగునీరు యధావిధిగా అక్కమ్మ చెరువులోకి వెళ్లేందుకు మార్గం సుగుమైంది. ఆక్రమణల తొలగింపునకు ‘సాక్షి’ ప్రత్యేక చొరవను స్థానికులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

వివక్ష లేని సమాజాన్ని నిర్మిద్దాం

శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి లలితకుమారి


విద్యార్థినులకు ఆటవస్తువులు అందజేస్తున్న అధికారులు

పూడూరు: సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కారిస్తూ.. అసమానతలు దూరం చేసేలా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కేతావత్ లలితకుమారి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లలపై వివక్షను తొలగించేలా అవగాహన కల్పించాలన్నారు. ‘సేవ్‌ది గర్ల్‌చైల్డ్, బేటీబచావో– బేటీపడావో’ కార్యక్రమాలను ఉధృతం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు ఆట వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి ఫాతిమా, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ బలరాం, అధికారులు శ్రీకాంత్, వరలక్ష్మి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు


మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు

కుల్కచర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి సారించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు సూచించారు. బుధవారం మందిపల్ ఉన్నత పాఠశాల పరిధిలో సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 370 జీఓ వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఉపాధ్యాయులను వారి ప్రాంతాలకు బదిలీ చేయాలన్నారు. నిబంధనల ప్రకారం ప్రమోషన్లు ఇచ్చిన అనంతరం వెంటనే బదిలీ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ఎన్నికల హామీలో పేర్కొన్న విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కొన్నేళ్లుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పట్టించుకోని దుస్థితి నెలకొందన్నారు. కొత్త ప్రభుత్వం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, సత్యనారయణ, శ్రీశైలం, అనిల్, ఆంజనేయులు, విఠల్, శ్రీనివాస్, రామకృష్ణ, వెంకటేశ్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చేవెళ్ల: చేవెళ్లలో వేరువేరు ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న పది మందిని ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖానాపూర్, నాంచేరి గ్రామాల్లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్‌లో కొందరూ పేకాట ఆడుతున్నట్లు ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక పోలీసులతో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అదుపులోని తీసుకున్నారు. మరోచోట నాంచేరి సమీపంలో కూడా పేకాట ఆడుతున్నట్లు తెలియటంతో అక్కడ దాడులు చేయగా పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. రెండు చోట్ల మొత్తం 10 మంది పేకాటరాయుళ్లు పట్టుబడినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.60 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

కడ్తాల్: అక్రమ మార్గంలో కృత్రిమంగా ఇసుకను తయారు చేసి విక్రయించేందుకు వెళుతున్న ఓ ట్రాక్టర్‌ను విశ్వసనీయ సమాచారంతో పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం మండల పరిధిలోని ముదీ్వన్ గ్రామ సమీపంలో అక్రమంగా కృత్రిమ ఇసుకను తయారు చేసి ఆమనగల్లులో విక్రయించేందుకు వెళుతున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను ముందస్తు సమాచారం మేరకు పోలీసులు పట్టుకొని వాహన డ్రైవర్‌ను విచారించగా ఎలాంటి అనుమతులు లేవని తేలింది. దీంతో వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఆ గ్రామ సమీపంలో ఫిల్టర్ ఇసుక తయారీ ప్రదేశంలో మరో ట్రాక్టర్ ట్రాలీని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇసుక ట్రాక్టర్ యాజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉద్యాన పంటలతో లాభాలు


సూచనలు చేస్తున్న వైస్ చాన్సలర్ నీరజాప్రభాకర్

కొండాలక్ష్మణ్ విశ్వవిద్యాలయం వీసీ నీరజాప్రభాకర్

పూడూరు: పండ్లు, పూలు, కూరగాయలను సాగు చేసి అధిక దిగుబడులను సాధించాలని కొండాలక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ నీరజాప్రభాకర్ రైతులకు సూచించారు. బుధవారం పూడూరు మండల కేంద్రంలోని పలు మామిడి తోటలను, కూరగాయ పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పండ్లు, కూరగాయల మొక్కలపై రైతులకు అవగాహన కల్పించారు. భూముల ధరలు అమాంతం పెరగడంతో సాగు తగ్గిందన్నారు. ఈ క్రమంలోనే కూరగాయల పంటల ధరల పెరుగుదలలో హెచ్చుతగ్గులు ఉన్నాయన్నారు. క్రమం తప్పకుండా కూరగాయల పంటలను సాగు చేస్తే ధరలు తలుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి చక్రపాణి, పరిగి డివిజన్ ఉద్యాన అధికారి వైజయంతికల్యాణ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కాశీవిశ్వనాథ్

రూ.6.83 లక్షలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

మీర్‌పేట: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులను మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర నాందేడ్ పట్టణానికి చెందిన షేక్ అమీర్(25) బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మల్లాపూర్ బాబానగర్‌కు చెందిన షేక్ ఫిరోజ్(25)తో కలిసి గతంలో పలు కేసుల్లో ఇద్దరు నిందితులుగా జైలు జీవితం గడిపారు. నిజామాబాద్ ఆటోనగర్‌కు చెందిన అమీర్(23)తో వీరిద్దరికి పరిచయం ఏర్పడింది. షేక్‌అమీర్, అమీర్‌లు నగరానికి వచ్చి బాబానగర్‌లోని ఫిరోజ్ ఇంట్లో ఉంటూ బైకుపై కాలనీల్లో తిరుగుతూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకునేవారు. ఈ నెల 13న అల్మాస్‌గూడ విశాఖనగర్‌లో నివాసముండే మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏఈగా విధులు నిర్వహించే శ్రీనివాసులు మధ్యాహ్నం ఇంటికి తాళాలు వేసి వనస్థలిపురం వెళ్లి తిరిగి వచ్చేసరికి షేక్ అమీర్, ఫిరోజ్, అమీర్‌లు తాళాలు పగులగొట్టి ఇంట్లోని రూ.11 లక్షల నగదును దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి మంగళవారం సాయంత్రం మీర్‌పేట నందిహిల్స్ వద్ద షేక్ అమీర్, ఫిరోజ్‌లను అదుపులోకి తీసుకుని రూ.6 లక్షల 83 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అమీర్ పరారీలో ఉండగా ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో డీఐ వై.జి.నాయుడు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఇళ్లలో చోరీ

రూ.80 వేల నగదు, ఆభరణాలు అపహరణ


చిందరవందరగా పాడేసిన వస్తువులు

అనంతగిరి: రెండు ఇళ్లలోకి చొరబడి నగదుతో పాటు వెండి, బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పాతగంజ్‌లోని ప్రసాద్ ఇంట్లో అద్దెకు ఉండే రెండు ఇళ్ల వాళ్లు ఊరికి వెళ్లారు. అర్ధరాత్రి దుండగులు తాళాలు విరగొట్టి ఇంట్లోకి చొరబడి వస్తువులను చిందరవందరగా పారేశారు. గమనించిన స్థానికులు యజమానులకు ఫోన్ చేసి తెలిపారు. రెండు ఇళ్లలో మొత్తం 10 తులాల వెండి, రూ.80 వేల వరకు నగదుతో పాటు అర తులం బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు.

మాతోనే ‘పాలమూరు’కు జాతీయ హోదా

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణ శివారులోని కుంట్లరాంరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పిన నాటి సీఎం కేసీఆర్ హామీలు నెరవేరలేదన్నారు. కనీసం తట్టెడు మట్టిని కూడా ఎత్తిపోయలేదన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటే ప్రాజెక్టు జాతీయ హోదా సాధించడం సులభం అవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. గతంలో బీఆర్ఎస్ నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ నేతలను అనేక ఇబ్బందులకు గురిచేశారన్నారు. అయినా బెదరకుండా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు ఎంతో కృషి చేశారన్నారు. ఎంపీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు తగిన విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊరడమ్మా.. బతుకునివ్వమ్మా

వర్షాలు సమృద్ధిగా కురవాలని.. పాడి పంటలు బాగుండాలని కోరుతూ రుక్మాపూర్‌వాసులు బుధవారం ఊరడమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రతీ గడప నుంచి అమ్మవారికి బోనాలు తీశారు. పోతరాజుల విన్యాసాలు, ఏర్పులమ్మ భవిష్యవాణి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బంధువులు, ఆడపడుచుల రాకతో గ్రామంలోని ఇళ్లు సందడిగా మారాయి. విందు, వినోదాలతో గ్రామస్తులంతా ఉల్లాసంగా గడిపారు.

– పెద్దేముల్


రుక్మాపూర్‌లో బోనమెత్తిన ఆడపడుచులు


బోనాలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


బోనమెత్తిన ఏర్పులమ్మ